క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



బీరేపల్లిలో ప్రచారం చేస్తున్న టిఎన్.దీపిక

హిందూపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టిఎస్.దీపిక కోరారు. గురువారం బీరేపల్లి గ్రామ పంచాయతీలోని పెద్దగుడ్డంపల్లిలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే పథకాలు అందేవన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే ఇంటి వద్దే పథకాలు అందుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎం చేసుకుందామన్నారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, జెసీఎస్ కన్వీనర్ గిరి, నాయకులు గొల్ల వేణు, రవీంద్రారెడ్డి, ఆదిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గోపి, హనుమంతరాయప్ప పాల్గొన్నారు.

'సిద్ధం' సభకు తరలిరండి



సిద్ధం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వేణురెడ్డి, నాయకులు, కార్యకర్తలు

లేపాక్షి/ హిందూపురం: రాప్తాడులో ఈనెల 18న జరిగే సిద్ధం సదస్సుకు భారీగా ప్రజలు తరలి రావాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన లేపాక్షి, హిందూపురంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ విజయవంతంపై ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. లేపాక్షి, హిందూపురం మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

'ఆరోపణల్లో వాస్తవం లేదు'



మాట్లాడుతున్న కన్వీనర్ నరేష్

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన భారతి అనే మహిళ తనపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని వైఎస్సార్‌సీపీ బీ బ్లాక్ కన్వీనర్ నరేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను ఇంటి స్థలాలు ఇస్తానని చెప్పి ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి రూ.20 లక్షలకు విక్రయించి మోసం చేసినట్లు భారతి చేసిన ఆరోపణను ఖండించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పోచనపల్లి సమీపంలో తాను అన్ని అనుమతులతో లేఔట్ వేశానని, వాటిలో 2019లో భారతి 8 ప్లాట్లను వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసిందన్నారు. వాటికి సంబంధించి ఆమెకు పక్కాగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చానన్నారు. అయితే 2022లో వచ్చిన భారీ వర్షాలతో తాను కొనుగోలు చేసిన ప్లాట్లు ముంపునకు గురయ్యాయని, ఆ ప్లాట్లను తానే కొనుగోలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేయడంతో మానవతా దృక్పథంతో వాటిని విక్రయించే బాధ్యత తాను తీసుకొని ఆమెకు రూ.3లక్షలు ఫోన్ పే ద్వారా చెల్లించానన్నారు. ఆమెకు రూ.15 లక్షలు చెక్కుల రూపంలో ఇచ్చానన్నారు. అయినప్పటికీ ఆమె తమ ఇంటిపై గుండాలతో దాడికి యత్నించిందని, దీనిపై తాను స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేస్తే ఆమెపై కేసు నమోదు చేశారన్నారు.

రోడ్డు కోసమే ప్రహరీ తొలగింపు

పెనుకొండ రూరల్: ఎర్రమంచి పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని సర్పంచ్ నాగమూర్తి పేర్కొన్నారు. గురువారం సచివాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల ప్రహరీని అక్రమంగా కూల్చేశారని ఓ పత్రికలో కథనం ప్రచురించారన్నారు. మండల మీట్‌లో తీర్మానం తర్వాతే రహదారి కోసం ప్రహరీ తొలగించామన్నారు. పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



చిలమత్తూరు పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

చిలమత్తూరు: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని జేసీ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ భాగ్యలత, సర్వేయర్ సురేష్, బీఎల్ఓలు ఉన్నారు.

సామాజిక భద్రత!

- ప్రతినెలా 1న పింఛన్ల పంపిణీ
- పెనుకొండ నియోజకవర్గంలో ప్రతి నెలా రూ.12.76 కోట్ల అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

గోరంట్ల: వైఎస్ జగన్ సర్కార్ సామాజిక భద్రతకు పెద్దపీట వేసింది. వైఎస్సార్ పింఛన్ కానుక పేరుతో సామాజిక భద్రతా పింఛన్లను ప్రతి నెలా 1వ తేదీన క్రమం తప్పకుండా ఇస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే.. వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, డప్పు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు, డయాలసిస్ రోగులు తదితరులు తమ కనీస అవసరాలు తీర్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే పింఛన్లు అందేవి. అర్హత ఉన్నా పింఛన్లు అందక చాలా మంది ఇబ్బంది పడేవారు. పింఛన్ తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు కాసేవాళ్లు. కొత్తగా పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ పొందుతున్న వారు ఎవరైనా చనిపోతే వారి స్థానంలో ఇచ్చే పరిస్థితి ఉండేది.

హామీ ఇచ్చాడు.. నెరవేర్చాడు..

2018లో అప్పటి ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, డప్పు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగులు, డయాలసిస్ రోగుల పరిస్థితి స్వయంగా పరిశీలించారు. తాను అధికారంలోకి వస్తే పింఛన్ సొమ్మును రూ.3 వేలదాకా పెంచుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకే పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతినెలా 1 వ తేదీన తెల్లవారుజామున పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గంలో 42,838 మందికి ప్రతినెలా రూ.12.76 కోట్లు పంపిణీ చేస్తున్నారంటే సామాజిక భద్రతకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇస్తోందో అర్థం చేసుకోవచ్చు.

వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ వివరాలు..

మండలం	లబ్ధిదారులు	పంపిణీ చేసే సొమ్ము(రూ.లలో)
పెనుకొండ	7532	2,18,42,500
గోరంట్ల	11,731	3,49,12,500
పరిగి	8,768	2,63,04,000
సోమందేపల్లి	7,019	2,10,96,500
రొద్దం	7,788	2,34,64,000



గోరంట్ల చౌడేశ్వరీ కాలనీలో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

పెద్దకొడుకులా ఆదుకుంటున్నాడు..



నాకు ప్రతినెలా 1వ తేదీన వలంటీర్ రూ.3 వేలు పింఛన్ సొమ్ము ఇంటి వద్దే అందిస్తున్నాడు. గతంలో పింఛన్ సొమ్ము తీసుకునేందుకు చాలా ఇబ్బందులు పడేదాన్ని. ఇప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే పింఛన్ సొమ్ము తీసుకుంటున్నా. ఎవరి మీద ఆధారపడాల్సిన అవసరం లేదు. జగన్ పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. ఆయనకు రుణపడి ఉంటా. – మాల వెంకటలక్ష్మమ్మ, గోరంట్ల

ఆత్మగౌరవంతో బతుకుతున్నా..



నేను దివ్యాంగురాలిని. నాకు ఎలాంటి పని చేయడం చేతకాదు. ప్రభుత్వం వికలాంగ పింఛన్ మంజూరు చేసింది. పింఛన్ మొత్తం ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్ ఇంటికి వచ్చి ఇచ్చిపోతారు. ఇతరులమీద ఆధార పడకుండా ఆత్మగౌరవంతో బతుకుతున్నా. జగనన్న ప్రభుత్వం మేలును జన్మలో మరువలేను. ఆయన మళ్లీ సీఎం కావాలి. ఇదే నా కోరిక. – అనుసూయమ్మ, గోరంట్ల

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



వాదోపవాదాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లు

హిందూపురం: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నాగేంద్రబాబు, ఆసీఫ్‌వుల్లా, ఈర్షద్ అహ్మద్, మల్లికార్జున మాట్లాడుతూ పురం తాగునీటి అవసరాల కోసం పీఏబీఆర్‌లో 1 టీఎంసీ నీటిని కేటాయించారన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఎలాంటి కేటాయింపులు లేకుండానే గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని తెచ్చి మున్సిపాలిటీ నెత్తిన అప్పుల కుంపటి పెట్టారని మండిపడ్డారు. గొల్లపల్లి రిజర్వాయర్ పైప్‌లైన్ కోసం ఖర్చుచేసిన వ్యయంలో నాలుగో వంతు ఖర్చుచేసి పీఏబీఆర్ పైప్‌లైన్లు మరమ్మత్తులు చేసింటే పుష్కలంగా నీరు వచ్చేదన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నీటి వద్దనుకుంటే తాగొద్దంటూ టీడీపీ కౌన్సిలర్లు రఘు, రమేష్ తదితరులు పేర్కొన్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్లకు మధ్య వాగ్వాదం జరిగింది. టీడీపీ కౌన్సిలర్ రఘు అడ్డగా మాట్లాడుతూ చైర్‌పర్సన్ వైపు చూపిస్తూ మాట్లాడటంతో గందరగోళం నెలకొంది. దీంతో ఆయన్ను ఒక సమావేశానికి సస్పెండ్ చేశారు.

కమీషన్ల కోసమే గొల్లపల్లి పైప్‌లైన్..

టీడీపీ నేతలు కమీషన్ల కోసమే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డిలు విమర్శించారు. బ్యాక్‌వాటర్ వినియోగానికి రూ.194 కోట్లు ఖర్చు చేసి మున్సిపాల్టీ నెత్తిన అప్పుల భారం మోపారన్నారు. మున్సిపాల్టీని నిలువునా ముంచేసిన ఘనత ఎమ్మెల్యే బాలకృష్ణ దక్కుతుందన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ అప్పు రూ.111 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని, ఆర్‌పీజీటీరోడ్డు, గురునాథ్ టాకిస్ రోడ్లకు పేరు మార్చడానికి అజెండా అంశాలను రద్దు చేస్తూ తీర్మానం చేశారు.

మద్యం ధ్వంసం

పావగడ: తాలూకా వ్యాప్తంగా వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సుమారు రూ.4 లక్షల విలువైన మద్యం బాటిళ్లను స్థానిక ఎక్సైజ్ పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ మైఖేల్ జార్జ్, మారప్ప హిత్తలమని, రేవంత్ కర్, రెవెన్యూ అధికారులు రాజగోపాల్, ఎక్సైజ్ సిబ్బంది నాగేశ్,రవి చంద్ర, మారుతి, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

పెనుకొండ: బాల్య వివాహాలను నిర్మూలిద్దామని దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షురాలు లక్ష్మమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని టింబక్ట్ కలెక్టివ్ కార్యాలయంలో గురువారం ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి మహిళా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయరాదన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమాజంలో మహిళల హింస, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దిశ చట్టంపై అవగాహన కల్పించారు.

జగన్ పాలనలో గ్రామస్వరాజ్యం సాకారం

- స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. రెడ్డిపల్లి, తురకలాపట్నంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభించారు. రెడ్డిపల్లి సచివాలయం వద్ద మంత్రి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజలకు సుపరిపాలన సాధ్యమైందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం వల్ల సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన అవస్థలు తప్పాయన్నారు. సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రంలో రైతులను నాణ్యమైన విత్తనాలు, ఎరువులతోపాటు అన్ని సేవలు అందుతున్నాయని తెలిపారు.

గ్రామాల్లోనే మెరుగైన వైద్యం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు గ్రామాల్లో మెరుగైన వైద్యం అందుతోందని మంత్రి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి పాలన ప్రజలకు అందలేదన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకుని మంచి చేసే నాయకుడు ఒక జగనన్న మాత్రమే అన్నారు. రెడ్డిపల్లి వద్ద సచివాలయానికి ఉచితంగా భూమి ఇచ్చిన బీటీ కృష్ణారెడ్డి కుటుంబాన్ని మంత్రి అభినందించారు. ప్రజలకు మంచి చేసే నాయకులను ఎప్పటికీ మరువకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మావతి, రెడ్డిపల్లి, తురకలాపట్నం సర్పంచులు రత్నమ్మ, లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ రామాంజినమ్మ, తురకలాపట్నం ఎంపీటీసీ మాధవి, మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, కేపీ శ్రీనివాసులు, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ వెంకటనారాయణ, ఎంపీడీఓ కేశవరెడ్డి, కాంట్రాక్టర్ అరుణ్‌కుమార్, విజయమోహన్‌రెడ్డి, ముఖ్య నాయకులు అక్కులప్ప, నరేంద్రరెడ్డి, రాజారెడ్డి, సి.నారాయణరెడ్డి, ఎన్ నారాయణరెడ్డి, వినయ్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



రెడ్డిపల్లిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు దీపిక, బోయ శాంతమ్మ
- డ్వాక్రా మహిళలకు రూ.7.30 కోట్ల మెగా చెక్కు అందజేత



డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న సమన్వయకర్తలు టీఎన్ దీపిక, బోయ శాంతమ్మ



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

చిలమత్తూరు: మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ హిందూపురం అసెంబ్లీ సమన్వయకర్త టీఎన్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా కింద డ్వాక్రా మహిళలకు రూ.7.30 కోట్ల మెగా చెక్కు అందజేశారు. అనంతరం డ్వాక్రా మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. ప్రతి మహిళా లక్షాధికారి కావాలని ఆకాంక్షించి ఆ కలను సాకారం చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ఆయన్ను మరోమారు సీఎం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. తొలిసారి అసెంబ్లీ, పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం మహిళలకు కల్పించారని, ప్రతి ఒక్క మహిళ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

పీహెచ్‌సీ భవనం ప్రారంభం

కోడూరు థామస్ మస్రో తోపులో నూతన పీహెచ్‌సీని నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక, పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ గురువారం ప్రారంభించారు.


నూతన సచివాలయ భవనం ప్రారంభం కావడంతో పాత సచివాలయ భవనాన్నే పీహెచ్‌సీగా మార్చారు. కోడూరు పరిధిలో వైద్యం చేయించుకోవాలంటే ప్రజలు చిలమత్తూరుకు వెళ్లాలంటే ఇబ్బందులు ఉండేవని, సమన్వయకర్త దీపిక చొరవతో పీహెచ్‌సీని ప్రారంభించినట్లు సర్పంచ్ మురళీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ రాజారెడ్డి, పార్టీ సీనియర్ నేత రామకృష్ణారెడ్డి, నాగరాజు, మాజీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు తిరుమలేష్, సంధ్య, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

నియోనెటల్ అంబులెన్స్‌పై అవగాహన

లేపాక్షి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన నియోనెటల్ అంబులెన్స్‌పై డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు గురువారం అవగాహన కల్పించారు. మాతా శిశు సంరక్షణ కోసం ప్రభుత్వం కొత్తగా జిల్లా ఆసుపత్రికి ఒకటి చొప్పున నియోనెటల్ అంబులెన్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో ఆక్సిజన్‌తో పాటు వివిధ రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశారని, ప్రసవమైన మహిళలు, పసిపిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ పేర్కొన్నారు. 108 సిబ్బంది బాలిరెడ్డి, నారాయస్వామి, నటేష్, నాగరాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే కుంచిటి వక్కలిగలకు న్యాయం

మడకశిర: సీఎం వైఎస్ జగన్ హయాంలోనే నియోజవర్గంలోని కుంచిటి వక్కలిగలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. అమరాపురం మండలం హల్కూరుకు చెందిన కాంతరాజు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడంతో పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోకల అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాంతరాజుకు పదవి రావడంతో నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడిందని తెలిపారు. మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంతరాజుకు వైఎస్సార్‌సీపీలో మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులందరూ ఆయనకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని తెలిపారు. తనకు రాష్ట్ర స్థాయి పదవి ఇవ్వడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కాంతరాజు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్ రెడ్డి, రంగేగౌడ్, జీబీ శివకుమార్, రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, వైస్ ఎంపీపీ రంజిత్, ఎంపీటీసీ హనుమంతరాయుడు, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు జయప్రకాష్, డైరెక్టర్ నాగరాజగౌడ్, స్థానిక నాయకులు సత్యనారాయణ, శ్రీరాములు, నాగన్న ,నాగేంద్ర,సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాంతరాజును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం

పార్టీ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ నియోజకవర్గంలోని జేసీఎస్ కన్వీనర్లతో సమావేశమయ్యారు. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. పార్టీని గెలిపించడానికి కష్టపడి పని చేయాలని సూచించారు. జేసీఎస్ కన్వీనర్లు శివన్న, నాగేంద్ర, విక్రమ్,శ్రీనివాసరెడ్డి, శివకుమార్, నాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఆయన మండలంలోని డీలర్లతో కూడా సమావేశమయ్యారు. వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

అమరాపురం: వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమతులైన హలకూరు కాంతరాజును గురువారం స్థానిక విశ్రాంతి భవనంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ వీరక్యాతరాయప్ప, ఎంపీటీసీలు హనుమంతరాయ, నారాయణ, కెంచప్ప, నాయకులు జయప్రకాష్ సదానందగౌడ, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి



మడకశిరలో సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలో గరువారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం వరకు సేవాలాల్ చిత్రపటాన్ని వెండి రథం పై ఊరేగించారు. బంజార వర్గానికి చెందిన యువతీ, యువకులు నృత్యం చేస్తూ ముందు సాగారు. తర్వాత మిట్టబండ అంజినేయస్వామి ఆలయం వద్ద జరిగిన సమావేశంలో బంజారా సంఘం నాయకులు మాట్లాడుతూ సేవాలాల్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నియోజవర్గంలోని బంజార సంఘం నాయకులు, కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీసుల పేరుతో చోరీ

పావగడ: పోలీసుల పేరుతో వృద్ధురాలిని మోసగించి 32 గ్రాముల బంగారు సరాన్ని దొంగలించిన ఘటన పట్టణంలోని ఆదర్శ లాడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే...తాలూకా లోని దండ పాళ్య గ్రామానికి చెందిన రత్నమ్మ అనే వృద్ధురాలు ఆదర్శ లాడ్జ్ సందులో నడుచుకుంటూ వెళుతోంది. ఇంతలో ఓ ఆగంతకుడు వృద్ధురాలి వద్దకు వచ్చి తాము పోలీసులమని నీ మెడలోని బంగారు సరాన్ని పరిశీలించాలని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి వృద్ధురాలు మెడ లోని బంగారు సరాన్ని తీసి అతనికి ఇచ్చింది. వెంటనే ఆ సరాన్ని తీసుకున్న ఆగంతుకుడు పరారయ్యాడు. అయితే ఈ సంఘటన అక్కడున్న ఓ సీసీ కెమెరా లో నిక్షిప్తమైంది. పట్టణ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

భువనేశ్వరి పర్యటనలో విభేదాలు బట్టబయలు

మడకశిర: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి గురువారం నిజం గెలవాలి అనే కార్యక్రమంలో భాగంగానియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని టీడీపీ నేత విభేదాలు మరోసారి బయటపడ్డాయి.మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం నాయకులు భువనేశ్వరికి ఆగ్రంపల్లి వద్ద, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గం నాయకులు కల్లుమర్రి వద్ద స్వాగతం పలికారు. ఆమె గుడిబండ మండలం దిన్నేహట్టికి వెళ్లారు. అయితే ఆమె వెంట మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాత్రమే వెళ్లారు. ఇదిలా ఉండగా భువనేశ్వరి మడకశిరకు వచ్చి తన తండ్రి ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రసంగించారు. అయితే తన తండ్రి విగ్రహాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలతో పాటు టీడీపీ శ్రేణులు అవాక్కయ్యారు.

వైఎస్సార్‌సీపీ ఏబ్లాక్ కన్వీనర్‌గా మన్సూర్‌ఖాన్



హిందూపురం: వైఎస్సార్‌సీపీ హిందూపురం పట్టణ ఏ బ్లాక్ కన్వీనర్‌గా టి.మన్సూర్‌ఖాన్‌ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసినట్లు నియోజకవర్గ సమన్వయకర్త టిఎన్.దీపిక తెలియజేశారు. సీఎం సాదిక్ స్థానంలో అతడిని నియమించినట్లు పేర్కొన్నారు.

మార్కెట్‌లో కుప్పకూలిన రైతు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ రైతు కుప్పకూలి మృతి చెందాడు. వివరాలు..లేపాక్షి మండలం కల్లూరుకు చెందిన రైతు ఓబుళప్ప(56) గురువారం చింతపండు విక్రయించేందుకు వచ్చాడు. మార్కెట్లో ఉన్నట్లుండి కుప్పకూలాడు. ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు యార్డు కార్యదర్శి జి చంద్రమౌళి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: మండల కేంద్రానికి చెందిన వడ్డె ఆశోక్ ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి సీఎం సహాయనిధి కింద రూ.లక్ష మంజూరైంది. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, సమన్వయకర్త ఉషాశ్రీ చరణ్ గురువారం చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, వార్డు సభ్యుడు గంగాధర్ పాల్గొన్నారు.